నేటి మ్యాచ్ కోల్‌కతా X ఢిల్లీ
కోల్‌కతా : రా. 7.30



# విల్ జాక్స్ విధ్వంసం

**సిక్సర్లతో గుజరాత్‌ను ముంచిన ఆర్సీబీ బ్యాటర్ • 201 టార్గెట్‌ను 16 ఓవర్లలోనే ఊదేసిన బెంగళూరు • రాణించిన కోహ్లీ**

**ఐపీఎల్-17లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) మరోసారి అదరగొట్టింది. నాలుగు రోజుల క్రితమే హైదరాబాద్‌ను చిత్తుచేసిన బెంగళూరు.. తాజాగా అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌కు చుక్కలు చూపించింది. గుజరాత్ నిర్దేశించిన 201 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఊదేసింది. ఛేదనలో రారాజు కోహ్లీ మరోసారి మెరవగా విల్ జాక్స్ సిక్సర్ల సునామీతో 41 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అంతకుముందు గుజరాత్ తరపున సాయి, షారుక్ ఖాన్‌లు రాణించినా ఆ జట్టు బౌలర్లు విఫలమయ్యారు.**

అహ్మదాబాద్: ఐపీఎల్-17 సీజన్ తొలి అంకంలో ఆరు మ్యాచ్‌లు ఓడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండో మ్యాచ్ గెలుచుకుంది. అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌ను వాళ్ల సొంతగడ్డలో 9 వికెట్ల తేడాతో చిత్తుచేసింది. గుజరాత్ నిర్దేశించిన 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్సీబీ.. మరో 24 బంతులు మిగిలుండగానే ఊదేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (41 బంతుల్లో 100 నాటౌట్, 5 ఫోర్లు, 10 సిక్సర్లు) నరేంద్ర మోడీ స్టేడియంలో సిక్సర్లతో హోరెత్తించి అజేయ శతకం సాధించగా విరాట్ కోహ్లీ (44 బంతుల్లో 70 నాటౌట్, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 84 నాటౌట్, 8 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించగా షారుక్ ఖాన్ (30 బంతుల్లో 58, 3 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు.

### సాయి, షారుక్ ఖాన్‌ల జోరు

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ 45 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. గిల్ (16) మరోసారి విఫలమయ్యాడు. కానీ వన్‌డౌన్ బ్యాటర్ సాయి, బ్యాటింగ్‌లో ప్రమోషన్ పొందిన షారుక్ ఆర్సీబీ బౌలర్లను దంచి కొట్టారు. ఈ ఇద్దరూ ధాటిగా ఆడటంతో గుజరాత్ భారీ స్కోరు దిశగా సాగింది. షారుక్ ఔట్ అయినా మిల్లర్ (19 బంతుల్లో 26 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) తో కలిసి సాయి గుజరాత్ స్కోరును 200 మార్కుకు చేర్చాడు.

### ఆరంభంలో కోహ్లీ.. ఆఖర్లో జాక్స్..

భారీ ఛేదనను ఆర్సీబీ ధాటిగానే ఆరంభించింది. ఫాఫ్ డుప్లెసిస్ (12 బంతుల్లో 24, 1 ఫోర్, 3 సిక్సర్లు) ఉన్నంతసేపు మెరుపులు మెరిపించి కోహ్లీతో కలిసి తొలి వికెట్‌కు 3.5 ఓవర్లలోనే 40 పరుగులు జోడించాడు. ఫాఫ్ ఔట్ అయ్యాక గుజరాత్ బౌలర్లపై కోహ్లీ ఎదురుదాడికి దిగాడు. 32 బంతుల్లోనే కోహ్లీ అర్ధ సెంచరీ పూర్తయింది. ఇక క్రీజులో కుదురుకునేదాకా నెమ్మదిగా ఆడిన జాక్స్ ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 14 ఓవర్లు ముగిసేసరికి ఆర్సీబీ స్కోరు 148/1 కాగా మిగిలిన 2 ఓవర్లలో జాక్స్ విధ్వంస సరచనకు తెరతీశాడు. మోహిత్ శర్మ 15వ ఓవర్లో 4, 6, 6, 6, 4తో 29 పరుగులు రాబట్టిన అతడు.. రషీద్ ఖాన్ 16వ ఓవర్లో 6, 6, 4, 6, 6 తో 41 బంతుల్లో శతకాన్ని పూర్తిచేయడమే గాక మ్యాచ్‌నూ ముగించాడు. తొలి 29 బంతుల్లో 44 పరుగులే చేసిన జాక్స్.. ఆ తర్వాత 11 బంతుల్లోనే 56 రన్స్ దండుకున్నాడు. ఇందులో 7 సిక్సర్లు న్నాయి. రెండో వికెట్‌కు ఈ జోడీ 12.1 ఓవర్లలోనే 156 పరుగులు జోడించింది.

**5**

**జాక్స్ సెంచరీ ఐపీఎల్‌లో ఐదో వేగవంతమైన శతకం. గేల్ (30), పఠాన్ (37), మిల్లర్ (38), ట్రావిస్ హెడ్ (39)లు జాక్స్ కంటే ముందున్నారు.**


విల్ జాక్స్ (100*)

### సంక్షిప్త స్కోర్లు

**గుజరాత్:** 20 ఓవర్లలో 200/3 (సాయి 84 నాటౌట్, షారుక్ 58, స్వప్నిల్ 1/23, మ్యాక్స్‌వెల్ 1/28). **బెంగళూరు:** 16 ఓవర్లలో 206/1 (జాక్స్ 100 నాటౌట్, కోహ్లీ 70 నాటౌట్, కిషోర్ 1/30)

## రెండో స్థానంలో భారత్

- ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్
- తెలంగాణ అమ్మాయికి స్వర్ణం



దుబాయ్: ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ అదరగొట్టింది. 7 స్వర్ణాలు, 11 రజతాలు, 11 కాంస్య పతకాలు సాధించిన భారత్.. 29 పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. 1992, 1996 తర్వాత ఈ టోర్నీలో రెండో స్థానంలో నిలవడం భారత్‌కు ఇదే తొలిసారి. ఈ క్రీడల్లో చైనా కూడా 29 పతకాలే నెగ్గినా ఆ జట్టు 16 స్వర్ణాలు గెలవడంతో అగ్రస్థానాన నిలిచింది. కాగా ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన యువ అథ్లెట్ దొడ్ల సాయి సంగీత.. 4X400 రిలేలో స్వర్ణం గెలుచుకుంది. అనుష్క, జయవింధ్య, దేవ శేఖర్‌లతో పాటు సంగీత.. పసిడి నెగ్గింది.

## బంగ్లాపై భారత్ ఘనవిజయం

సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనను భారత మహిళల క్రికెట్ జట్టు విజయంతో ఆరంభించింది. సిల్హెట్ వేదికగా ఆదివారం బంగ్లాతో జరిగిన తొలి టీ20లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. యస్తికా భాటియా (36) టాప్ స్కోరర్. అనంతరం ఛేదనలో ఆతిథ్య జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 101 పరుగులకే పరిమితమవడంతో భారత్ 44 పరుగుల తేడాతో గెలుపొందింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' రేణుకా సింగ్ (3/18) బంగ్లాను కట్టడిచేసింది.

## క్వార్టర్స్‌లో ఓడిన తెలంగాణ

నారాయణ్‌పూర్: స్వామి వివేకానంద అండర్ -20 పురుషుల జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. నారాయణ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్) వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా ఆదివారం మణిపూర్.. 4-1 తేడాతో తెలంగాణను ఓడించి సెమీస్‌కు అర్హత సాధించింది.

# ఛేదనలో మళ్లీ తుస్!


రుతురాజ్ (98*)

**హైదరాబాద్‌ను చిత్తుచేసిన చెన్నై • గైక్వాడ్ కెప్టెన్ ఇన్నింగ్స్**

**ఈ సీజన్‌లో ముందు బ్యాటింగ్ చేస్తూ భారీ స్కోర్లు నమోదుచేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఛేదనలో మాత్రం వరుసగా రెండోసారి చేతులెత్తేసింది. ఉప్పల్‌లో బెంగళూరుతో ఆడిన గత మ్యాచ్ మాదిరిగానే చెపాక్ (చెన్నై) లోనూ తడబడింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సమిష్టి ప్రదర్శనతో ఎస్ఆర్‌హెచ్‌పై ఘనవిజయాన్ని సొంతం చేసుకుంది. చెన్నై నిర్దేశించిన 213 పరుగుల లక్ష్య ఛేదనలో 134 పరుగులకే ఆలౌట్ అయింది.**

చెన్నై: ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ చేతులెత్తేసింది. ఆదివారం చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ముగిసిన పోరులో భాగంగా 213 పరుగులను ఛేదించే క్రమంలో ఎస్ఆర్‌హెచ్.. 134 పరుగులకే కుప్పకూలి 78 పరుగుల తేడాతో ఓడింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 212 పరుగుల భారీ స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (54 బంతుల్లో 98, 10 ఫోర్లు, 3 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. డారిల్ మిచెల్ (32 బంతుల్లో 52, 7 ఫోర్లు, 1 ఇన్నింగ్స్) రాణించాడు. అనంతరం ఛేదనకు దిగిన హైదరాబాద్.. 18.5 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌట్ అయింది. మార్క్‌రమ్ (26 బంతుల్లో 32, 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా టాపార్డర్ బ్యాటర్లంతా చేతులెత్తేశారు.

సీఎస్‌కే బౌలర్లలో తుషార్ దేశ్ పాండే (4/27), మతీశ పతిరాన (2/17) హైదరాబాద్‌ను కట్టడి చేశారు. గైక్వాడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్

చెన్నై బ్యాటింగ్‌లో గైక్వాడ్ ఇన్నింగ్సే హైలైట్. రహానే నిరాశపరిచినా వన్‌డౌన్‌లో వచ్చిన డారిల్ మిచెల్‌తో కలిసి సీఎస్కే స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. రెండో వికెట్‌కు 107 పరుగులు జత చేసిన ఈ జోడీని 14వ ఓవర్లో ఉనద్కత్ విడదీశాడు. చివరి ఓవర్లలో దూబే (20 బంతుల్లో 39 నాటౌట్, 1 ఫోర్, 4 సిక్సర్లు)తో కలిసి చెన్నై సారథి దూకుడుగా ఆడటంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

### రైజర్స్..మళ్లీ అదే తడబాటు..

భారీ ఛేదనలో రైజర్స్ మరోసారి తేలిపోయింది. ట్రావిస్ హెడ్ (13), అభిషేక్ శర్మ (15)ను పెవిలియన్‌కు పంపిన తుషార్ ఎస్ఆర్‌హెచ్‌ను ఆదిలోనే దెబ్బతీశాడు. నితీశ్ (15) నిరాశపరిచాడు. మార్క్‌రమ్‌ను పతిరాన పదో ఓవర్లో ఐదో బంతికి క్లీన్‌బౌల్డ్ చేసి రైజర్స్‌ను కోలుకోనీయలేదు. హైదరాబాద్ భారీ ఆశలు పెట్టుకున్న హెన్రిచ్ క్లాసెన్ (20) కూడా పతిరాన బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరాడు. అబ్దుల్ సమద్ (19)ను శార్దూల్ ఔట్ చేయడంతో చెన్నై విజయం ఖరారైంది.

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 9 | 8 | 1 | 0.69 | 16 |
| కోల్‌కతా | 8 | 5 | 3 | 0.97 | 10 |
| చెన్నై | 9 | 5 | 4 | 0.81 | 10 |
| హైదరాబాద్ | 9 | 5 | 4 | 0.07 | 10 |
| లక్నో | 9 | 5 | 4 | 0.05 | 10 |
| ఢిల్లీ | 10 | 5 | 5 | -0.27 | 10 |
| గుజరాత్ | 10 | 4 | 6 | -1.11 | 8 |
| పంజాబ్ | 9 | 3 | 6 | -0.18 | 6 |
| ముంబై | 9 | 3 | 6 | -0.26 | 6 |
| బెంగళూరు | 10 | 3 | 7 | -0.41 | 6 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

### సంక్షిప్త స్కోర్లు

**చెన్నై:** 20 ఓవర్లలో 212/3 (రుతురాజ్ 98, మిచెల్ 52, భువనేశ్వర్ 1/38, ఉనద్కత్ 1/38). **హైదరాబాద్:** 18.5 ఓవర్లలో 134 (మార్క్‌రమ్ 32, క్లాసెన్ 20, తుషార్ 4/27, పతిరాన 2/17)

## రికర్వ్ జట్టు సంచలనం

**ఆర్చరీ వరల్డ్ కప్‌లో స్వర్ణం • దీపికాకు రజతం**



షాంఘై: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో భారత పురుషుల రికర్వ్ జట్టు సంచలనం సృష్టించింది. 14 ఏండ్ల తర్వాత ఈ టోర్నీలో స్వర్ణం నెగ్గింది. తుదిపోరులో తెలుగు ఆటగాడు ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్‌లతో కూడిన త్రయం.. 5-1 (57-57, 57-55, 55-53) తేడాతో ఒలింపిక్ చాంపియన్స్ దక్షిణ కొరియాకు షాకిచ్చింది. ఈ విభాగంలో భారత్ చివరిసారిగా 2010లో స్వర్ణం గెలవగా.. నాడు పసిడి గెలిచిన జట్టులో ఉన్న తరుణ్‌దీప్ 2024లోనూ ఆడటం గమనార్హం. మహిళల వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్‌లో మాజీ వరల్డ్ నెంబర్ వన్ దీపికా కుమారి ఫైనల్‌లో 0-6 తేడాతో ప్రపంచ రెండో ర్యాంకర్ లిమ్ సిహ్-యోన్ (కొరియా) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. మిక్స్‌డ్ టీమ్ రికర్వ్ ఈవెంట్‌లో భారత ద్వయం అంకిత-ధీరజ్‌లు కాంస్యం నెగ్గారు. ఈ టోర్నీలో భారత్ ఐదు స్వర్ణాలు, రెండు రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం 8 పతకాలు సాధించింది.

## అమ్మాయిలు అదుర్స్

**భారత్ చేతిలో సింగపూర్ చిత్తు**
**ఉబెర్ కప్‌లో క్వార్టర్స్ బెర్తు ఖాయం!**



చెంగ్డూ: సీనియర్ల గైర్హాజరీలో యువ భారత షట్లర్లు అదరగొడుతున్నారు. చెంగ్డూ (చైనా) వేదికగా జరుగుతున్న ఉబర్ కప్‌లో ఆదివారం మన అమ్మాయిలు.. 4-1 తేడాతో సింగపూర్‌ను చిత్తుగా ఓడించి క్వార్టర్స్ బెర్తును ఖాయం చేసుకున్నారు. సింగపూర్‌తో పోరులో భాగంగా సింగిల్స్‌లో అష్మిత 15-21, 18-21 తేడాతో జియా మెన్ చేతిలో ఓడింది. కానీ ఆ తర్వాత రెండు సింగిల్స్, రెండు డబుల్స్ గేమ్స్‌లో భారత్ నెగ్గింది. ప్రియా-శృతిల ద్వయం 21-15, 21-16 తేడాతో జియో ఎన్ హెంగ్-జిన్ యూ జియాలను చిత్తు చేసింది. సిమ్రన్-రితికా.. 21-8, 21-11 తేడాతో టింగ్ ఎల్వా-జన్ మిచెల్లీలను ఓడించింది. మిగిలిన రెండు సింగిల్స్ గేమ్స్‌లో ఇషాణి 21-13, 21-16 తేడాతో ఇన్సిరా ఖాన్‌ను చిత్తు చేయగా చివరి మ్యాచ్‌లో అన్మోల్.. 21-15, 21-13 తేడాతో లీ జిన్‌ను మట్టికరిపించింది.

# రాబడి

## లాభాల స్వీకరణ దిశగా..





**గత** వారం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలనే అందుకున్నాయి. ఆఖరిరోజు భారీ నష్టాలనే మూటగట్టుకున్నా.. ఓవరాల్‌గా మదుపరులు కొనుగోళ్లకు మద్దతు పలికారు. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 641.83 పాయింట్లు ఎగిసి 73,730.16 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 272.95 పాయింట్లు పుంజుకొని 22,419.95 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేయవచ్చన్న అంచనాలున్నాయి. దీంతో పెట్టుబడుల ఉపసంహరణలకు వీలు కనిపిస్తున్నది. అయితే కొంతమేర కొనుగోళ్లకూ దిగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ మెజారిటీ విశ్లేషకులు.. సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోను కావచ్చన్న సంకేతాలనే ఇస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, వివిధ అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం మార్కెట్ తీరును నిర్దేశించనున్నాయి. చమురు మార్కెట్ తీరుతెన్నులు.. దేశీయ స్టాక్ మార్కెట్లను ఎక్కువగా ప్రభావితం చేయవచ్చన్న విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. నిఫ్టీకి 22,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 21,900 మద్దతు స్థాయిగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 22,600-22,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా అంటున్నారు.

# రీట్స్ Vs ఇన్విట్స్








### రీట్స్ అంటే?

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్)ను నూతన ఆర్థిక సాధనాలుగా చెప్పుకోవచ్చు. అయినప్పటికీ మ్యూచువల్ ఫండ్స్ వంటివే. మదుపరుల నుంచి నిధులను సేకరించి ఆఫీస్ స్పేస్, మాల్స్, హోటల్స్, రెసిడెన్షియల్ ప్రాపర్టీస్, గిడ్డంగుల వంటి ఆదాయ కారక రియల్ ఎస్టేట్ ప్రాపర్టీల్లో పెట్టుబడులుగా పెడుతాయి. ఈ పెట్టుబడులపై అద్దె రూపంలో వచ్చిన ఆదాయాన్ని.. ఇన్వెస్టర్లకు డివిడెండ్ల రూపేణా పంపిణీ చేస్తాయి. రీట్స్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో నమోదవుతాయి. డీమ్యాట్ ఖాతా ద్వారా షేర్లలో ఎలాగైతే మనం పెట్టుబడులు పెడుతామో అలాగే వీటిల్లోనూ పెట్టుబడి పెట్టవచ్చు. రీట్‌లో కనీస పెట్టుబడి ఒక్కో లాట్‌కు *రూ.10,000-15,000* మధ్య ఉంటుంది. మీ పెట్టుబడుల్లో వైవిధ్యం కోసం వీటిని ఎంచుకోవచ్చు.

### ఇన్విట్స్ అంటే?

రీట్స్ తరహాలోనే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఇన్విట్స్) ఉంటాయి. అయితే నిర్మాణ రంగ ప్రాజెక్టుల్లో రీట్స్ పెట్టుబడులు పెడితే.. ఇన్విట్స్ మాత్రం మౌలిక రంగంలో పెట్టుబడులను పెడుతాయి. రహదారులు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్స్, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల్లో ఈ పెట్టుబడులుంటాయి. డివిడెండ్ల రూపంలో ఇన్వెస్టర్లకు రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందిస్తాయి. ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కంపెనీలు ఇన్విట్స్‌ను ఏర్పాటు చేస్తాయి. తద్వారా వివిధ మౌలిక రంగ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులను సమీకరిస్తాయి. ట్రస్టీ, స్పాన్సర్, ఇన్వెస్ట్‌మెంట్-ప్రాజెక్ట్ మేనేజర్‌లు ఉంటారు. ఇన్విట్స్‌లో కనీస పెట్టుబడి దాదాపు రూ.10,000-15,000. డీమ్యాట్ ఖాతా, మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఇన్విట్స్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు.

### రీట్స్‌లో రకాలు

**ఈక్విటీ రీట్స్:** అద్దెల ద్వారా ఆదాయాన్ని పొందుతాయి.

**మార్ట్‌గేజ్ రీట్స్:** తనఖా ఆస్తుల్లో పెట్టుబడుల ద్వారా వడ్డీని ఆర్జిస్తాయి.

**హైబ్రీడ్ రీట్స్:** ఈక్విటీ, మార్ట్‌గేజ్ రీట్స్‌ల మాదిరి పెట్టుబడులపై అద్దె, వడ్డీలను అందుకుంటాయి.

**ప్రైవేట్ రీట్:** వీటిలో పరిమిత సంఖ్యలో మదుపరులుంటారు. సెబీ వద్ద నమోదు కావు. స్టాక్ మార్కెట్ల జోలికి వెళ్లవు.

**పబ్లిక్ ట్రేడెడ్ రీట్:** స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో ట్రేడ్ అవుతాయి. సెబీ దగ్గర రిజిస్టర్ అవుతాయి.

**నాన్ పబ్లిక్ ట్రేడెడ్ రీట్:** సెబీ వద్ద నమోదైనా.. స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ కావు. కాబట్టి ఒడిదొడుకులకు ఆస్కారం ఉండదు.

### ఇన్విట్స్‌లో రకాలు

**పూర్తయిన ప్రాజెక్టులు:** హైవేలు, పవర్ ప్లాంట్ల వంటి పూర్తయిన మౌలిక రంగ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేవి.

**నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు:** ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మౌలిక రంగ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేవి. వీటి నుంచి ఆదాయం పొందడానికి కొంత సమయం పడుతుంది.

**ప్రైవేట్ ప్రాజెక్టులు:** స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఈ ఇన్విట్స్ నమోదు కావు. అందువల్ల రిటైల్ ఇన్వెస్టర్లు వీటిని కొనలేరు. దీంతో వీటిలో మదుపరులు పరిమిత సంఖ్యలోనే ఉంటారు.

**ప్రభుత్వ రంగ ప్రాజెక్టులు:** స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదవుతాయి. రిటైల్ ఇన్వెస్టర్లు సులభంగా పెట్టుబడులు పెట్టుకోవచ్చు.

- ప్రాజెక్టు రకాన్నిబట్టి ఇన్విట్స్‌ను ఇలా కూడా విభజించుకోవచ్చు. ఎనర్జీ, టాన్స్‌పోర్ట్-లాజిస్టిక్స్, కమ్యూనికేషన్, సామాజిక,-వాణిజ్య ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాటర్-శానిటేషన్.

### ? ఏది ఉత్తమం

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ రెండూ కూడా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లోకి మదుపరులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రవేశించడానికి దోహదం చేస్తాయి. రియల్టీ పెట్టుబడులను సులభతరం చేస్తాయి. అంతేగాక పెట్టుబడులు పెట్టిన మదుపరులకు డివిడెండ్ల రూపంలో రెగ్యులర్ ఆదాయాన్ని అందిస్తాయి. అయినప్పటికీ లాభాలు, నష్టాలున్నాయి. రీట్స్‌లో భారీగా నగదు నిల్వలుంటాయి. స్థిరమైన ఆదాయాన్ని అందిస్తాయి. కానీ స్టాక్ మార్కెట్ ఒడిదొడుకులకు తీవ్రంగా ప్రభావితమై ఉంటాయి. ఇక ఇన్విట్స్‌లో తక్కువ నగదు నిల్వలుంటాయి. రీట్స్ తరహాలో స్థిరమైన ఆదాయం ఇన్వెస్టర్లకు రాదు. కానీ రాజకీయ పరిణామాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. కాబట్టి అటు రీట్స్‌లోగానీ, ఇటు ఇన్విట్స్‌లోగానీ పెట్టుబడులు పెట్టే ముందు స్వతంత్ర రేటింగ్ ఏజెన్సీలు విడుదల చేసే రేటింగ్స్‌ను పరిశీలించండి. ఆ తర్వాత మీ లక్ష్యాలు, రాబడికి పట్టే సమయంపట్ల మీకుండే ఓపిక ఆధారంగా నిర్ణయం తీసుకోండి.

## వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబు రేట్లు

**పాత పన్ను విధానం**

| శ్లాబులు (రూ.లలో) | 60 ఏండ్ల లోపు | 60-80 ఏండ్ల మధ్య | 80 ఏండ్లు పైబడిన వారు |
|---|---|---|---|
| 2.5 లక్షల వరకు | లేదు | లేదు | లేదు |
| 2.5 లక్షలు-3 లక్షలు | 5% | లేదు | లేదు |
| 3 లక్షలు-5 లక్షలు | 5% | 5% | లేదు |
| 5 లక్షలు-10 లక్షలు | 20% | 20% | 20% |
| 10 లక్షలపైన | 30% | 30% | 30% |

**కొత్త పన్ను విధానం**

| | |
|---|---|
| 3 లక్షల వరకు | లేదు |
| 3 లక్షలు-6 లక్షలు | 5% (సెక్షన్ 87 ఏ క్రింద ట్యాక్స్ రిబేటు) |
| 6 లక్షలు-9 లక్షలు | 10% (సెక్షన్ 87 ఏ క్రింద రూ.7 లక్షల వరకు ట్యాక్స్ రిబేటు) |
| 9 లక్షలు-12 లక్షలు | 15% |
| 12 లక్షలు-15 లక్షలు | 20% |

{15 లక్షలపైన ఆదాయం ఉంటే 30% వార్షిక పన్ను చెల్లించాలి}

# ట్యాక్స్‌పేయర్స్.. పారాహుషార్

**జూలై 31లోగా ఐటీఆర్ దాఖలైతేనే పాత పన్ను విధానం ప్రయోజనాలు**

2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్స్‌ను దాఖలు చేస్తున్న ట్యాక్స్‌పేయర్స్‌కు సూచన. పాత పన్ను విధానాన్ని ఎంచుకునేవారు జూలై 31లోగా ఐటీఆర్‌లను దాఖలు చేయాలి. లేకపోతే పాత పన్ను విధానం ఐటీ ప్రయోజనాలు రావు. ఆగస్టు 1 నుంచి దాఖలయ్యే ఐటీఆర్‌లు కొత్త పన్ను విధానానికి లోబడే ఉంటాయి. ఈ ఏప్రిల్ 1 నుంచే 2024-25 మదింపు సంవత్సరం కోసం ఐటీఆర్‌ల దాఖలు మొదలైంది. దీంతో ఈ ఏడాది జూలై 31లోగా జరిమానా లేకుండా ఐటీ రిటర్నులను దాఖలు చేసే వారికే పాత పన్ను ప్రయోజనాలు అందుతాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ చెప్తున్నది. ఆ తర్వాత మీ ఐటీఆర్‌లు డీఫాల్ట్‌గా కొత్త పన్ను విధానంలోకే వెళ్తాయంటున్నారు.

### ఇది కీలకం

ఆదాయ పన్ను చట్టం ప్రకారం కొత్త పన్ను విధానం డీఫాల్ట్. అంటే ట్యాక్స్‌పేయర్‌కు ఇప్పటికే ఇది వర్తిస్తున్నదన్న మాట. ఒకవేళ ఉద్యోగులు పాత పన్ను విధానాన్ని కోరుకుంటే కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ఆ విషయాన్ని తమ సంస్థకు తెలియజేయాలి. ఒకవేళ అలా చేయకుంటే సదరు ఉద్యోగి ఆటోమేటిగ్గా కొత్త పన్ను విధానం కిందకే వస్తాడు. దీంతో కొత్త పన్ను శ్లాబుల్లోని రేట్ల ప్రకారమే పన్ను కోతలు, మినహాయింపులుంటాయి. అయినప్పటికీ గడువులోగా ఐటీఆర్ ఫైలింగ్ చేసే ఉద్యోగులకు పాత, కొత్త పన్ను విధానాలను ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఏటా వేతన జీవులకు మాత్రమే ఈ వీలున్నది. కానీ వ్యాపారులు, ట్రేడర్లకు ఏడాదికోసారి కాకుండా ఒక్కసారే ఈ అవకాశం వస్తుంది.

***పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల వరకు పన్ను మినహాయింపులు అందుబాటులో ఉన్నాయి. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు, స్టాండర్డ్ డిడక్షన్ కింద రూ.50,000, ఎన్‌పీఎస్‌కు రూ.50,000 వరకు మినహాయింపున్నది. అలాగే కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ కింద మాత్రమే రూ.50,000 పన్ను మినహాయింపున్నది.***

### పన్ను విధానాల్లో మినహాయింపులు, కోతల ప్రయోజనాలు

| కోత లేదా రాయితీ | పాతది | కొత్తది |
|---|---|---|
| స్టాండర్డ్ డిడక్షన్ | ఉన్నది | ఉన్నది |
| హెచ్‌ఆర్‌ఏ | ఉన్నది | లేదు |
| గృహ రుణం | ఉన్నది | లేదు |
| సెక్షన్ 80సీ కింద పెట్టుబడికి | ఉన్నది | లేదు |
| ఆరోగ్య బీమా | ఉన్నది | లేదు |
| విద్యా రుణం | ఉన్నది | లేదు |
| ఎల్‌టీఏ | ఉన్నది | లేదు |
| ఎన్‌పీఎస్ (80సీసీడీ02) | ఉన్నది | లేదు |
| ఎన్‌పీఎస్ (80సీసీడీ-1బీ) | ఉన్నది | లేదు |

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.